క్లుప్తంగా

సుభద్రంపేటలో పారిశుధ్య చర్యలు



గ్రామంలో దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తుందని, దీని కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఈ నెల 23వ తేదీన సాక్షిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. డ్రైనేజీలలో పూడికలు తొలగించి, మురుగు నీరు పారేలా ఏర్పాట్లు చేశారు. దోమల మందు పిచికారీ చేయించారు. గ్రామంలో వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు. ఆయా సమస్యలను పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నేటి నుంచి బంగారు వరలక్ష్మి కానుక



వివరాలు వెల్లడిస్తున్న కంబాల

కోరుకొండ: ఆధ్యాత్మిక భావాన్ని విస్తృతం చేయాలని, మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావాలన్న ఉద్దేశంతో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీజేపీ నాయకుడు, విశ్వహిందూ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం నుంచి ఆగస్టు ఆరో తేదీ వరకూ బంగారు వరలక్ష్మి కానుక–3 లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సోమవారం గోకవరంలో, 29న గోకవరం, పరిసర గ్రామాల్లో, 30న శ్రీరంగపట్నంలో, ఆగస్టు 2న కోరుకొండలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే 5న సీతానగరం, 6న రాజానగరంలో జరుగుతుందని చెప్పారు. గెలుపొందిన మహిళలకు వరలక్ష్మి రూపులను ఉచితంగా అందజేస్తామన్నారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

పెదపూడి: మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని అందరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామేశ్వరం గ్రామంలో కాకినాడ క్షత్రియ పరిషత్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ వారిపై సీతారామరాజు పోరాటం శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా **తులసి, జెడ్పీటీసీ** సభ్యురాలు పేపకాయల వెంక**టలక్ష్మి, సర్పంచ్** కొటికలపూడి చినబాబు, ఎం**పీటీసీ సభ్యుడు** సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు మూడు రోజులు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ/రాజ**మంహేంద్రవరం** రూరల్: తొర్రేడు 33/11 కేవీ, **తొర్రేడు జేహెచ్‌సీ** సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ **సంబంధిత, రోడ్ల** మరమ్మతుల కోసం సోమవారం **నుంచి మూడు** రోజుల పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం(ఆపరేషన్స్) ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తొర్రేడు, టిడ్కో గృహాలు, వెంకటనగరం ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. అలాగే అగ్రికల్చర్ మోటర్లకు ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తారన్నారు. వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

అతి మధురం.. సీతాఫలం

- చాగల్నాడు మార్కెట్‌లో ఏజెన్సీ ఫలాలు
- దళారుల జోక్యంతో పెరిగిన ధర
- హైవే వెంబడి చిరు వర్తకుల విక్రయ స్టాళ్లు





జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సీతాఫలాల విక్రయ స్టాళ్లు

రాజానగరం: వర్షాకాలం వచ్చిందంటే చాలు చాగల్నాడు ప్రాంతంలో సీతాఫలాలు మార్కెట్‌లో దర్శనమిస్తుంటాయి. పేరులోనే కాకుండా, రుచిలో కూడా యాపిల్‌తో పోటీ పడే కస్టర్డ్ యాపిల్ (సీతాఫలం)కు చాగల్నాడు పెట్టింది పేరు. ఇక్కడ లభించే సీతాఫలాలు.. ఆకారంలో ఆకర్షిస్తూ, రుచిలో మైమరపిస్తుంటాయి. దీంతో ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని ఈ ప్రాంతంలో సీతాఫలాల తోటలు కనుమరుగవుతున్నాయి. ఈ తరుణంలో సీతాఫలాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయింది. వీటిపైనే ఆధారపడిన చిరు వర్తకులు సీజన్‌లో ఖాళీగా ఉండలేక ఈ సమయంలో ఏజెన్సీలో విరివిగా దొరికే సీతాఫలాలను ఇక్కడకు తీసుకువచ్చి, జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం చాగల్నాడు మార్కెట్‌లో ఏజెన్సీ సీతాఫలాలను జోరుగా విక్రయిస్తున్నారు.

రోజుల తరబడి నిల్వ

చాగల్నాడులో పండే సీతాఫలాలు పక్వానికొచ్చిన తర్వాతనే చెట్ల నుంచి కోస్తుంటారు. దీనితో మార్కెట్‌లో అవి నిగనిగలాడుతూ కొనుగోలుదారులను ఆకట్టుకుంటాయి. నిల్వకు పనికి రావు. ప్రస్తుతం ఏజెన్సీ నుంచి వస్తున్న సీతాఫలాలు కాయలుగా ఉంటే, నిల్వకు కొంత మేరకు పనికి వస్తాయి. కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లిన తర్వాత ఒక్కొక్కటిగా ముగ్గుతుంటాయి. కాయలు పక్వానికి వచ్చాక కొనుగోలు చేస్తే, వెంటనే విక్రయాలు జరుగకపోతే ఎందుకూ పనికి రావు. ఏజెన్సీ వాసులకు కాస్తోకూస్తో ఆదాయం రావాలంటే పక్వానికి వస్తాయనగానే కాయలను చెట్ల నుంచి కోసేస్తుంటారు.

దళారులు చెప్పిందే ధర

ప్రస్తుతం చాగల్నాడు ప్రాంతానికి విరివిగా వస్తున్న ఏజెన్సీ సీతాఫలాలకు దళారులు చెప్పిందే ధరగా పలుకుతుంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు ఈ సీజన్‌లో సుమారు 3,500 మంది చిరు వ్యాపారులకు ఇవే జీవనాధారం. దీంతో చాగల్నాడులో సీతాఫలాల తోటలు కనుమరుగై, ఫలాల దిగుబడి లేకపోవడంతో ఏజెన్సీ నుంచి వచ్చే సీతాఫలాలను విక్రయించి, జీవనం సాగిస్తున్నారు. ఈ విధంగా 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు రహదారి పొడవునా విక్రయ కేంద్రాలు దర్శనమిస్తుంటాయి. గతంలో ఏజెన్సీలో వంద సీతాఫలాలను రూ.వంద లోపునే కొనుగోలు చేసేవారు. చాగల్నాడు మార్కెట్ విషయం వారికి కూడా తెలియడంతో అక్కడా ధర పెంచేశారు. ఈ కారణంగా అక్కడి నుంచి ఇక్కడకు కొంతమంది దళారులు వ్యాన్లపై వాటిని తీసుకువచ్చి, ఇక్కడి చిరు వ్యాపారులకు హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. ఈ విధంగా వారి నుంచి కొనుగోలు చేసిన సీతాఫలాలను స్థానికంగా లభించినట్టుగా భ్రమింపజేస్తూ, రహదారి పక్కన స్టాళ్లు ఏర్పాటు చేసి, కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసి, డజను రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు.

అలవాటు మానుకోలేక..



సీజన్ వారీగా లభించే పండ్లను విక్రయిస్తూ జీవనం గడిపే వారం కావడంతో ఈ సీజన్‌లో సీతాఫలాలను విక్రయించడం అలవాటుగా వస్తుంది. సుమారు పాతికేళ్లుగా ఉన్న ఈ అలవాటును పోగొట్టుకోలేక, వేరొక పని చేయలేక ఏజెన్సీలో సీతాఫలాలను కొనుగోలు చేసి ఇక్కడ వ్యాపారం చేయాల్సి వస్తుంది.

– చాట్ల తాతారావు, వెలుగుబంద

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా సీతాఫలాల విక్రయాల కోసమే స్టాల్ పెట్టుకుని కూర్చుంటుంటే దినసరి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఏజెన్సీ నుంచి వచ్చే కాయలను దళారులు చెప్పిన ధరకు కొనుగోలు చేసినా, విక్రయించే సమయంలో ఒక్కోసారి అయినకాడికే అమ్ముకోవాల్సి వస్తోంది.

– పసల సురేష్, కలవచర్ల

నడ్డి విరిచే రోడ్డు



రాజమహేంద్రవరం–సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో రఘుదేవపురం వద్ద ఏర్పడిన భారీ గోతులు

- శిథిలమైన రఘుదేవపురం ఆర్‌అండ్‌బీ రహదారి
- భారీ గోతులతో ప్రయాణికులకు నిత్య నరకం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు అధ్వానంగా మారిన ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం ఎప్పుడు దొరుకుతుందని ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాతేరు నుంచి సీతానగరం వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరైంది. అందులో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కాతేరు నుంచి రఘుదేవపురం శివారు వరకు నాలుగు లైన్ల రోడ్డు పూర్తయింది. అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు కూడా రోడ్డు నిర్మించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో శిథిలమైన రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు లబోదిబోమంటున్నారు. పెద్ద గోతుల్లో వాహనాలు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ బస్సులు సైతం మరమ్మతులకు గురై, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్లు ఈ గోతుల్లోంచి ప్రయాణిస్తుంటే.. వాహనాల కింది భాగం రోడ్డును తాకుతుందని వాహన యజమానులు చెబుతున్నారు. తద్వారా వాహనాలు మరమ్మతులకు గురై, జేబుకు భారీ చిల్లు పడుతుందని అంటున్నారు. ద్విచక్ర వాహనచోదకుల దుస్థితి వర్ణనాతీతం. గోతులను తప్పించే ప్రయత్నంలో వారు అదుపుతప్పి, రోడ్డుపై పడి గాయాల పాలవుతున్నారు. ఆస్పత్రి ఖర్చుల పేరిట చేతి చమురు వదులుతోందని వాపోతున్నారు. రెండు కిలోమీటర్ల రోడ్డుకూ మరమ్మతులు చేయలేని స్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తక్షణం రోడ్డు నిర్మించకలేకపోతే, కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ టీమ్ పర్యటన



ముగ్గళ్ల అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న టీమ్

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల, సీతానగరంల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ టీమ్ సభ్యులు ఆదివారం పర్యటించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ఆలయాలు, చర్చిల్లోని మరుగుదొడ్లు, నీటి సరఫరాను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలు, సచివాలయాలను, అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్లు సందర్శించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించి, తడి–పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. ప్రజలకు అందుతున్న కేంద్ర పథకాలపై ఆరా తీశారు. తాగునీటి సదుపాయం వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శులు హేమంత్, నాగరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాడ్రేవు సత్యసాయిప్రకాష్, సచివాలయాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెరవలి: గుర్తు తెలియని ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెరవలి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. తీపర్రులో ర్యాలీ లక్ష్మణరావుకు సంబంధించిన పొలం వద్ద ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పెరవలి ఏఎస్సై సూర్యచంద్రరావు తెలిపారు. ఆయన వివరాల మేరకు, మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటాయి. తెల్ల బనియన్, నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఎత్తు 5.2 అడుగులు ఉంటాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అంధకారంలో హండ్రెడ్ ఫీట్ రోడ్డు



వీధి లైట్లు వెలగని హండ్రెడ్ ఫీట్ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం హండ్రెడ్ ఫీట్ రోడ్డులో నెల రోజులుగా అంధకారం రాజ్యమేలుతోంది. వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసర గ్రామాల నుంచి ఎస్వీ జనరల్ మార్కెట్, నగరంలోని వివిధ ప్రాంతాలకు వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారుల్లో ఎంత మాత్రం చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో ఏ సమస్యలున్నా.. వాట్సాప్ నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్, ప్రస్తుత ఇన్‌చార్జి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రకటించినప్పటికీ.. ఆచరణలో మాత్రం కానరావడం లేదు. హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు స్పందించలేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే వాట్సాప్ నంబర్లు మినహా, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లారీని ఢీకొన్న ట్యాంకర్

రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

రాజానగరం: జాతీయ రహదారిపై కలవచర్ల జంక్షన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, అగ్నిమాపక దళం సహకారంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విశాఖపట్నం వైపు నుంచి ఈథనాల్ లోడుతో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ట్యాంకర్ కలవచర్ల జంక్షన్ వద్ద రోడ్డు పక్కకు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ట్యాంకర్ ఎడమ వైపు భాగం పూర్తిగా దెబ్బతిని, క్లీనర్ గాయపడ్డాడు. ట్యాంకర్‌లో ఈథనాల్ ఉండటంతో ముందు జాగ్రత్తగా అగ్నిమాపక వాహనాన్ని రప్పించారు. ట్యాంకర్ క్యాబిన్ పూర్తి నీటితో శుభ్రపరిచారు. ఈ క్రమంలో రహదారిపై వాహనాల రాకపోకలకు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడిందని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

సీతానగరం: కాటవరం శివారున పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కాటవరం, కొంతమూరు, రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.మూడు వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు చినకొండేపూడి పంచాయతీలో, మధ్యాహ్నం 4 గంటలకు రఘుదేవపురంలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ములకల్లంక, ఉదయం 11 గంటలకు కాటవరంల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రీసర్వే ప్రక్రియలో రెవెన్యూ రికార్డులు సరిచేయడం, రైతుల భూముల వివరాలు సరిచూసుకుని, అవసరమైన మ్యూటేషన్స్, కరెక్షన్లకు ఏ విధమైన రుసుములు తీసుకోకుండా సరిచేస్తారని వివరించారు. గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూముల హద్దులు నిర్ధారించడం, పట్టాదారు భూముల హద్దులు గుర్తించడం, రికార్డుల నిర్వహణ చేయడం వంటివి చేస్తారని తెలిపారు. గ్రామసభలు నిర్వహించే గ్రామాల్లో భూములున్న రైతులు హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.



డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో మూతపడిన ఓపెన్ ఎయిర్ థియేటర్



డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో వేలానికి నోచుకోని షాపులు

క్లోజ్‌ఎయిర్ థియేటర్

- సుబ్రహ్మణ్య మైదానం ఓపెన్ థియేటర్ మూతపడడంతో నగర ప్రజల అసంతృప్తి
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- ప్రారంభోత్సవానికి నోచుకోని షాపులు
- నగరపాలక సంస్థ ఆదాయ వనరులకు విఘాతం

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక రాజమహేంద్రవరం నగరంలో ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లాది వ్యయంతో నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్ నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. 2024 జనవరిలో అప్పటి ఎంపీ మార్గాని భరత్‌రామ్ కృషి చేసి డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో డాక్టర్ గరికపాటి రాజారావు స్మారక కళావేదికను ఓపెన్ థియేటర్‌గా అత్యంత సుందరంగా తయారు చేశారు. ఈ ఓపెన్ థియేటర్లో నిత్యం సంస్కృతి సంప్రదాయాలను వెలుగులోకి తీసుకువచ్చే సందేశాత్మక చిత్రాలను ప్రదర్శించే ఏర్పాటు చేశారు. దీంతో పాటు సుప్రసిద్ధ నటులు అవార్డు పొందిన సినిమాల ప్రదర్శనలూ చేసేలా ఏర్పాట్లు చేశారు.

సమన్వయ లోపం

సుబ్రహ్మణ్య మైదానం ఆధునీకరణలో భాగంగా ఐదు షాపులను నిర్మించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈ షాపులను నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులకు అప్పగించకపోవడంతో ఏడాదిన్నరగా అవి ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ప్రజాధనంతో నిర్మించిన ఈ షాపులను వేలం నిర్వహించి, చిరు వ్యాపారులకు అప్పగిస్తే.. నగరపాలక సంస్థకూ ఆదాయం చేకూరేది. కార్పొరేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో.. నిర్మాణం పూర్తయిన ఈ ఐదు షాపులను వేలం వేయకుండా అలాగే వదిలేశారు. అధికారులు స్పందించి షాపులకు వేలం నిర్వహించాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నగరపాలక సంస్థ ఆదాయ వనరులకు నష్టం వాటిల్లుతోంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏడాది పాటు సజావుగా నడిచిన ఈ ఓపెన్ **ఎయిర్ థియేటర్** ప్రస్తుతం మూతపడి ఉంది. **కూటమి ప్రభుత్వ** పాలనలో అధికారుల్వీ ఓపెన్ **ఎయిర్ థియేటర్**లో ప్రతి రోజూ వేసే సినిమా**లను నిలిపేయడం**తో ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం **చేస్తున్నారు. నిత్యం** సాయంత్రం వేళల్లో అవార్డు **పొందిన సినిమా**ల ప్రదర్శనకు నగరంలోని **సాహితీ, సినీ అ**భిమానులు తరలివచ్చి చిత్రా**లను వీక్షించేవారు**. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సంబంధిత కాంట్రాక్టర్‌ను పట్టించుకోకపోవడంతో సినిమాలు వేయడం నిలిపివేశారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో సినిమాలు ప్రదర్శించే చర్యలు చేపట్టాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి రోజూ సినిమాలు ప్రదర్శించాలి



నగరంలో సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నగరపాలక సంస్థ అధికారులు ప్రతి రోజూ సినిమాలు ప్రదర్శించే చర్యలు చేపట్టాలి. కొద్ది నెలలుగా సినిమాలు వేయకపోవడంతో సాయంత్రం సమయంలో సుబ్రహ్మణ్య మైదానానికి వచ్చే ప్రజలకు నిరాశే మిగులుతుంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– కాటం రజనీకాంత్, రాజమహేంద్రవరం

షాపులకు వేలం నిర్వహించాలి



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఐదు షాపులకు తక్షణమే వేలం నిర్వహించాలి. ప్రజాధనంతో నిర్మించిన ఈ షాపుల ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తుంది. ఉన్నతాధికారులు తక్షణమే దీనిపై దృష్టి సారించి ఆదాయాన్ని పెంపొందించే మార్గాలు చూడాలి.

– ఆముదాల రాజ్‌కుమార్, రాజమహేంద్రవరం

దర్శనానికి వెళ్లి వస్తూ మృతి

పెరవలి: జాతీయ రహదారిపై స్థానిక ఎస్ఆర్‌కే మిల్లు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పెరవలి ఏఎస్సై సూర్యచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ గోదావరి జిల్లా రాయలం గ్రామానికి చెందిన కొమ్మోజు విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు పెరవలి వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పింది. డ్రైవింగ్ చేస్తున్న విశ్వేశ్వరరావు కుమారుడు నిద్రమత్తులోకి జారుకోవడంతో, రోడ్డు పక్కనే ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని, అనంతరం ఐషర్ వ్యాన్‌ను కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిలిస్ట్‌కు తీవ్ర గాయాలు కాగా, కారులో ఉన్న విశ్వేశ్వరరావు, అతని భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో నలుగురు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో విశ్వేశ్వరరావు (55) మృతి చెందారు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సూర్యచంద్రరావు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

నిడదవోలు రూరల్: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు హెచ్చరించారు. మండలంలోని సమిశ్రగూడెం పురాతన వంతెన వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, ప్రతి ఒక్కరూ వాహనాల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడంతో పాటు, మద్యం సేవించిన పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్సై జి.కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.